క్లుప్తంగా

అంగన్‌వాడీలకు కుర్చీల అందజేత



అంగన్‌వాడీ చిన్నారులతో ఫౌండేషన్ సభ్యులు, టీచర్లు

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఏవీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీలు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఆడాల గణేశ్ మంగళవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులు, టీచర్లకు సరిపడా కుర్చీలను అందజేశారు. ఏవీజీ ఫౌండేషన్ గ్రామస్తులకు సహాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు. మాజీ సర్పంచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలబిల్లులు విడుదల చేయండి

రాంపూర్‌లో పాడిరైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న పాడి రైతులు

తలకొండపల్లి: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను ప్రభుత్వ సంస్థ విజయ డెయిరీ వెంటనే చెల్లించాలని మండల పరిధిలోని రాంపూర్‌లో మంగళవారం పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పాల బిల్లులు రావడం లేదని.. ఎలా మనుగడ సాగించాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని శ్రమ జీవులమైన మాకు బిల్లులు రాకుంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి బిల్లులు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పాడి రైతులు..కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, పర్వతాలు, జంగయ్య, అశోక్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

మంచాల: జిల్లా కలెక్టరేట్ ఎదుట రేపు నిర్వహించే ధర్నాలో ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ కోరారు. మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ క్రాంతికుమార్‌కు ధర్నా రోజు అనుమతి ఇవ్వాలని ఆశ వర్కర్లు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కృష్ణ మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు అమృత, కవిత, మంజుల, సంతోష, జ్యోతి, పారిజాత, ఐలమ్మ, సువర్ణ, స్వరూప, రుక్మిణి, శ్యామల, యాదమ్మ, సుమలత పాల్గొన్నారు.

సత్తయ్యకు సన్మానం

తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ చైర్మన్‌గా నియమితులైన కొత్తకుర్మ సత్తయ్యను మంగళవారం ఆయన నివాసంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, విజయానంద రెడ్డి, దశరథ, మేతరి అశోక్, దర్శన్, గుండా ధన్‌రాజ్, జొన్నాడ సుదర్శన్ రెడ్డి, బొడ్డు శ్రీను తదితరులు సత్తయ్యను కలిసినవారిలో ఉన్నారు.

పట్టపగలే ఇంట్లోకి దూరి..

- నగదు, బంగారం అపహరణ

ఇబ్రహీంపట్నం: పట్ట పగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.12లక్షల విలువ చేసే బంగారం, నగదును అపహరించిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో గల సాగర్ ఎన్‌క్లేవ్, ఏబీఆర్ కన్వెన్షన్ హాల్ పక్కన గల ఇంటి మొదటి అంతస్తులో కుటుంబ సభ్యులతో కలిసి మౌనిక నివాసముంటోంది. మంగళవారం దుస్తులు ఆరబెట్టేందుకు తలుపులు మూసి రెండో అంతస్తుపైకి వెళ్లింది. పది నిమిషాల అనంతరం వచ్చేసరికి ఇంటి లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో కిటికీలోంచి చూడగా గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి దూరినట్లు గుర్తించింది. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచేందుకు వెళ్లగా ఇంతలోనే వెనుకవైపు డోర్ నుంచి గుర్తు తెలియని దుండగుడు తప్పించుకున్నాడు. ఇంట్లో అల్మారాలో గల సుమారు రూ.12 లక్షల విలువ చేసే బంగారు వస్తువులు, కొంత నగదును దుండగుడు ఎత్తుకెళ్లాడు. ఈ మేరకు మౌనిక ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

సమస్యల స్వాగతం

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- నత్తనడకన మన ఊరు–మనబడి అభివృద్ధి పనులు
- మౌలిక సదుపాయల కల్పనలో విఫలం



ముకునూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గేటులేని ప్రహరీ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి బడి గంట మోగునుంది.. వేసవి సెలవుల్లో ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు బడి బాట పట్టనున్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 47 ప్రభుత్వ పాఠశాలలుం ఉండగా 14 ఉన్నత, 7 ప్రాథమికోన్నత, 26, ప్రాథమిక పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. అందులో 5,829 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇవేగాక ప్రభుత్వ సాంఘిక, గురుకులాలు 5 ఉండగా, ప్రైవేట్ పాఠశాలలు సుమారు 70కి పైగా ఉన్నాయి. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 215 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా మరో 12మంది కొరత ఉంది. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, మరికొన్ని పాఠశాలల్లో తరగతి గదికి ఒక టీచర్ చొప్పున లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

మౌలిక సదుపాయాలు కరువు

పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ముకునూర్ పాఠశాలలో ప్రహరీ కూలిపోవడంతో పాటు, గేట్‌ను ఏర్పాటు చేయలేని దుస్థితి ఉంది. ఇబ్రహీంపట్నం ఉర్దూ మీడియం పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలోని పలు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా నీటి కొరత, విద్యుత్ సమస్యలతో సతమతమౌతున్నారు. పాఠశాలను క్లీన్ చేసేందుకు స్వీపర్లు, విద్యార్థులకు కాపాలాగా ఉంటూ స్కూల్ బెల్ కొట్టే ఇతరత్రా పనులు చేసేందుకు వాచ్‌మెన్లు ఏ పాఠశాలకు లేకపోవడంతో ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

మనఊరు–మనబడి పథకం కింద చేపట్టిన పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. ఈ పథకం కింద మండలంలోని 15 పాఠశాలలు ఎంపికైతే 10 పాఠశాలల్లో పనులే ప్రారంభంకాకపోవడం శోచనీయం. శేరిగూడ ఎంపీపీఎస్, దండుమైలారం జెడ్పీహెచ్ఎస్, ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత, బాలికల జెడ్పీహెచ్ఎస్, ఎంపీయూపీఎస్, పొల్కంపల్లి ఎంపీపీఎస్, నాగన్‌పల్లి ఎంపీపీఎస్, ఆదిబట్లలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్, రాయపోల్‌లోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, చర్లపటేల్‌గూడ ఎంపీపీఎస్, కప్పపహాడ్ ఎంపీయూపీఎస్, శేరిగూడ జెడ్పీహెచ్ఎస్, కొంగరకలాన్ ఎంపీపీఎస్ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఒక శేరిగూడ పాఠశాలలో ముగింపు దశలో పనులు ఉండగా, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల టాయిలెట్స్ నిర్మాణం స్లాబ్ వరకు కాగా, డైనింగ్ హాల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా పొల్కంపల్లి ఎంపీపీఎస్, దండుమైలారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు నిలిచిపోయాయి. ఇప్పటివరకు చేసిన పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేసినట్లు సమాచారం. ఈనెల 19వ తేదీ వరకు జరిగే బడిబాటతో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న ఉద్దేశ్యంతో విద్యాశాఖ అధికారులున్నారు. నాణ్యమైన విద్యనందించాలన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు పంపించాం. కుట్టడం పూర్తికాగానే మరొక యూనిఫాంను విద్యార్థులకు అందజేస్తాం. 235 టీచర్లు పనిచేస్తుండగా మరో 12 మంది అవసరమున్నారు. వాచ్‌మెన్‌లు, స్వీపర్ల సమస్యలున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం.

– వెంకట్‌రెడ్డి ఎంఈఓ, ఇబ్రహీంపట్నం

కేజీబీవీకి విద్యుత్ సప్లై ఇవ్వాలి



కేజీబీవీ పాఠశాలను సందర్శించిన దశరథ్‌నాయక్, నాయకులు

- లేనిపక్షంలో సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తాం
- జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: కడ్తాల్ సమీపంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాలకు ఇంతవరకు విద్యుత్ సప్లై ఇవ్వకపోవడం ఏంటని.. విద్యుత్‌శాఖ అధికారులు పాఠశాలకు 24 గంటల్లోగా విద్యుత్ సప్లై ఇవ్వకపోతే విద్యార్థులు, స్థానికులతో కలసి సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ హెచ్చరించారు. కేజీబీవీ పాఠశాలను మంగళవారం వైస్ ఎంపీపీ ఆనంద్, స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయని.. ఇంతవరకు పాఠశాలకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సప్లై ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే సప్లై ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీలు ప్రియా రమేశ్, మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పంతునాయక్, హరిచంద్‌నాయక్, తులసీరాంనాయక్, శ్రీనునాయక్, భూనాథ్ నాయక్, సాయిలు, దేవా, నాయకులు పాండు, నర్సింహ, కిషన్, వెంకటయ్య, శంకర్, వాచ్య, సిద్ధూ, శ్రీకాంత్, చందు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ సర్దార్‌నాయక్



బడిబాటలో అధికారులు, ఉపాధ్యాయులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని.. బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఎంఈఓ సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య కోరారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలు, అక్కడి వసతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, రత్నమాల, శ్వేతమాధురి, పీఈటీ మల్లేశ్, సీఆర్పీలు రతన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు, పాఠ్యపుస్తకాల అందజేత

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి మంజూరైన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను మంగళవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య.. ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదయ్య, వెంకటేశ్వర్లు, విద్యావతమ్మ, శైలజ, గోవర్ధన్, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

వాచ్‌మెన్లను బంధించి..

- విల్లాలో చోరీకి యత్నం
- ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఘటన

ఇబ్రహీంపట్నం: వాచ్‌మెన్లను బంధించిన దుండగులు చోరీకి యత్నించిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. తుర్కయంజాల్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలోని ఓ విల్లాలో తిరుమనతురై కుటుంబం నివసిస్తున్నారు. వాచ్‌మెనైన మాదస్వామి, చార్లీయేస్వామిను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు తాళ్లతో బంధించి కత్తితో బెదిరించి, అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి విల్లా బాల్కనీలోకి ప్రవేశించారు. బాల్కనీలో శబ్దాలు వినిపిస్తుండగా కుతూరు సోబియా గుర్తించి మరో గదిలో నిద్రిస్తున్న తండ్రి తిరువన్ తురైకి తెలపడంతో పాటు 100కు డయల్ చేసింది. తండ్రి తిరువన్ తన స్నేహితుడైన శ్రీనివాస్‌రాజుకు సమాచారం ఇచ్చాడు. అయితే చోరీ చేసేందుకు యత్నించిన ఫలితం దక్కకపోవడంతో వాచ్‌మెన్ మాదస్వామి వద్ద ఉన్న 12వేల విలువచేసే సెల్‌ఫోన్‌ను దుండగులు తీసుకొని పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మైసమ్మ సన్నిధిలో అనంతరెడ్డి



ఆమనగల్లు: కడ్తాల మండలం మైసిగండిలోని మైసమ్మ దేవతను మంగళవారం ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి దర్శించుకున్నారు. మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘సురక్ష’ సేవలు అభినందనీయం

రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామ మూర్తి



విద్యార్థులు, మహిళలకు చెక్కులు అందజేసిన సంఘం సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: తెలుగు రాష్ట్రాల్లోని నిరుపేదలకు అండగా ఉంటున్న సురక్ష సేవా సంఘం సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామ మూర్తి కొనియాడారు. ఖమ్మం, నల్లగొండ వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్, రాజమండ్రి, గుంటూరు, కర్నూల్, విశాఖ పట్టణం జిల్లాల నుంచి 13 మంది మెడిసిన్, ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థులు మరియు కుటుంబ పెద్దను కోల్పోయిన తొమ్మిది మంది నిరుపేద ఆడపిల్లలు తమ వివాహానికి ఆర్థిక సహాయం చేయమని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సురక్ష సేవా సంఘానికి చేసిన విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులను పరిశీలించిన సంఘం ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ విభాగం దృష్టికి తీసుకువెళ్లగా 22 మంది పేద కుటుంబాలకు ముత్తూట్ సంస్థ ద్వారా రూ.9,60,000ను అందించేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు హిమాయత్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామ మూర్తి చేతుల మీదుగా సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కర గోపీ శంకర్ యాదవ్, అంతర్జాతీయ రైఫిల్ షూటర్ ప్రసన్న కుమార్, ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ జితేంద్ర కుమార్, మేనేజర్ యమగాటి లక్ష్మీ నారాయణ, సురక్ష ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్చార్జి సామల రవికుమార్, సభ్యులు రాజేష్‌గౌడ్, ముత్తూట్ సిబ్బంది పాల్గొన్నారు.

52 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

మండల కేంద్రంలోని జేఎస్ఎస్‌యూ ఆర్ఎం కాలనీలో ఉన్న సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నిరుపేదలకు, వృద్ధులకు 52మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కిక్కిర గోపి శంకర్‌యాదవ్ తెలిపారు. సురక్ష సేవా సంఘం తెలంగాణ మరియు శ్రీ ధనలక్ష్మి ఆప్టికల్స్ సంయుక్తంగా.. అబ్దుల్లాపూర్‌మెట్, మాల్, మల్లేపల్లి, హయత్‌నగర్, పఠాన్‌చెరు, నాదర్‌గుల్, షాద్‌నగర్, గుర్రంగూడ, చౌటుప్పల్‌కి చెందిన 52 మంది వృద్ధులకు విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేయించి మంగళవారం వారిని వారి గృహాలకు క్షేమంగా తరలించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు సంవత్సరాలుగా దాదాపు 204 మంది వృద్ధులకు విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. నిరుపేదలకు సంస్థ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని వినతి



ఎంపీఓకు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్‌లు

ఆమనగల్లు: మండలంలోని 13 గ్రామ పంచాయతీల మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీఓ శ్రీలతను కలిసి మాజీ సర్పంచ్‌లు వినతిపత్రం అందించారు. సర్పంచ్‌లుగా ఉన్నప్పుడు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వాటికి సంబంధించి దాదాపు రూ.2 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని వారు వివరించారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని.. పదవీకాలం ముగిసి నెలలు గడుస్తున్నా తమకు రావాల్సిన బిల్లులు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం పెడింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, శ్రీనయ్య, సోన శ్రీనునాయక్, మల్లమ్మ, చందునాయక్, ప్రేమలత, కొప్పు మంజుల, అమర్‌సింగ్, యాదయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ముజీబుర్ రహమాన్

జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రెహమాన్

తలకొండపల్లి: ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వాటి అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబుర్ రహమాన్ అన్నారు. శిథిలమైన పాఠశాలలకు మరమ్మతులు నిర్వహించి, అవసరమైన ప్రాంతాల్లో నూతన భవనాలు నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. మంగళవారం హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్‌లో జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొని మండలంలోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. తలకొండపల్లి మండల కేంద్రం నుంచి మిడ్జిల్ వరకు కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేయాలని, రోడ్డు మరమ్మతులు నిర్వహించి ప్రయానికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని, విద్యుత్ లైన్లు సరి చేయాలని కోరారు. పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను సకాలంలో విద్యార్థులకు అందజేయాలని సభలో కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన సాగుతోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన తహసీల్దార్ కార్యాలయ భవనం, కేజీబీవీ పాఠశాలల భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ ముంతాజ్, ఎస్ఓ అనిత, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, బీక్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్ విండో డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, నాయకులు.. జహంగీర్ అలీ, బాల్‌రాజ్,రాంచందర్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, భిక్షపతి, రాజేశ్, వినోద్, శాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

మంత్రివర్గంలో చోటు కల్పించాలి..

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం కోరారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం సత్యం మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా, ప్రస్తుతం కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి ఉన్నత విద్యావంతుడని అన్నారు. అనుభవం, విద్యావంతుడైన నారాయణరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరారు.

మాల్ అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి గ్రామస్తుల వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

యాచారం: మండల పరిధిలోని మాల్ గ్రామాభివృద్ధి కోసం అత్యధిక నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ పడకంటి కవిత, మాజీ సర్పంచ్ పద్మజా, నాయకులు పడకంటి శేఖర్‌గౌడ్, లిక్కి రాజారెడ్డి, జహంగీర్, గాలయ్య తదితరులు మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. మాల్ గ్రామంలో ప్రతి మంగళవారం పశువుల సంత జరుగుతోందని.. శాశ్వత స్థలం లేక ప్రైవేట్ వెంచర్లలోనే సంతను నిర్వహిస్తున్నారని తెలిపారు. పక్కనే 640 సర్వే నంబరులో 16 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉందని.. అందులో నుంచి 5 ఎకరాల భూమిని సంతకు కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు. నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్‌ను మరమ్మతులు చేయించి.. సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులను బస్టాండ్‌లోకి వచ్చి, పోయేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మాల్ గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతే లక్ష్యం



కుట్టు కేంద్రంలో యూనిఫాంలను పరిశీలిస్తున్న అధికారులు

అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావ్

మాడ్గుల: పొదుపు మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థుల స్కూల్ యూనిఫాంలను వారితో కుట్టిస్తోందని అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావ్ అన్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా కుట్టు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో మండలంలో 4 మహిళా కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో 2,675 విద్యార్థుల ఒక్కో జత చొప్పున కుట్టడానికి తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్కో యూనిఫాంకు రూ.75 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోందని అన్నారు. గడువులోగా కుట్టు పనులను పూర్తిచేయలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నర్సింహ, సీసీ పోచయ్య, ట్రైనర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పంపిచాలి..

యాచారం: పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా యూనిఫాంలను వెంటనే పాఠశాలలకు పంపించాలని అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావ్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో నిర్వహిస్తున్న యూనిఫాం కుట్టు కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. కుట్టిన దుస్తులను ఆయా పాఠశాలలకు వెంటనే పంపించాలని సూచించారు. కొన్ని పాఠశాలలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.